# అడ్డం వచ్చిన ఆషాఢం

ఎప్పుడో, ఏనాడో ఆషాఢమాసంలో గర్భం ధరించిన తల్లి మృత శిశువును కన్నదో, ఏ అవిటి బిడ్డకు తల్లి అయిందో-దాన్ని ఆధారంగా చేసుకుని ఆషాఢమాసంలో కోడలు అత్తగారింట్లో వుండకూడదని చెప్పి వుంటారు పెద్దలు లేదా అమ్మమీద మనసుపడ్డ కూతురు బెంగ ఈ విధముగా నయినా తీరుతుందని ఈ ఆచారం పెట్టారేమో! దానికి మనం మక్కీకి మక్కీ కాపీ కొట్టాల్సిన పనిలేదేమో!

—జయప్రద

---

"చూడు చూడు విజయా! సుబ్బు కూడా బట్టలు సర్దుకుంటున్నాడూ."

పేస్ట్ బ్రష్ సూట్ కేసులో వేస్తున్న నేను ఉలిక్కిపడి తలెత్తాను. అక్కలిద్దరూ ముసి ముసిగా నవ్వుకుంటున్నారు. కాస్త ఆశ్చర్యపోయాను. మరికాస్త సిగ్గుపడిపోయాను.

కొంగు పట్టుకుని పెళ్ళాం వెళుతున్నానని నవ్వుతున్నారు వీళ్ళు.

వీళ్ళ పెళ్ళయిన కొత్తలో అక్కలకూ, బావలకూ మధ్య నేను చడ్డీ వేసుకునేప్పుడు రాయబారాలు నడిపిన సంగతి అప్పుడే మర్చిపోయారు కాబోలు అలా ఉడుక్కుంది. ఆ విషయం గుర్తు చేయాలని నేను నోరు తెరిచానో లేదో నా పక్కలో బాంబు పేలింది.

"విజ్జీతో నువ్విప్పుడు వెళ్ళకూడదురా సుబ్బూ!"

"ఆదేం!...." ఆగిపోయాను.

అక్కలు ముసి ముసిగా నవ్వుల స్థాయి పెంచారు. నేనాలోచిస్తున్నాను.

"ఏంటమ్మా అక్కా చెల్లెళ్ళిద్దరూ కలిసి మా మరిదిని ఏడిపిస్తున్నారు" రంగప్రవేశం చేసింది. అమె గంభీరంగా వున్నట్లు నటిస్తోంది కానీ ఆపుకోలేని నవ్వు ఉబికి వచ్చి పెదాలమీద పరుచుకుంటోంది.

అమ్మ ఏదో పని వున్నట్టుగా అలావచ్చి అవసరంలేని ఖాళీ హార్లిక్స్ సీసా చేతిలోకి తీసుకుని—

"మీరలా వెళ్ళండి" అని ముగ్గుర్ని కసురుకుంది.

వాళ్ళనలా వెళ్ళనిచ్చి తనూ వెళ్ళబోతూ కాస్త ఇబ్బందిగా అంది.

"ఇది....ఇది....ఆషాడమాసం నువ్వు అత్తగారింటికెళ్ళకూడదులే నాయనా!"

"ఆషాడమాసం....అంటే" అలా అడిగిన నాకు వెంటనే అర్థమైపోయింది ఆదేదో మాసం రాక్షసమాసం మొత్తానికి మొగుడూ పెళ్ళాల్ని విడదీసే చప్పనాతి మాసం.

పోనీ విజ్జివి వుండిపొమ్మంటే....

చిన్న ఆశ కానీ అమ్మనెలా అడిగేది?....

అమ్మ వెళ్ళిపోయింది. నా మౌనాన్ని అంగీకారంగా తననుకున్నట్లు నటిస్తూ వెళ్ళిపోయింది. నేను కాదని హఠం చేస్తానని భయపడి వెళ్ళిపోయింది.

అమ్మ అలా వెళ్ళిపోగానే నాకో ఐడియా వచ్చింది. అలా ఎవర్నయినా అడ్డగిచులకనై పోయేకంటే.

"నేను నా భర్తనొదిలి క్షణమైనా వుండలేను" అని విజ్జీ చేత చెప్పించేసి విజ్జీకి పతివ్రత పోస్టు ఇచ్చేస్తే....

మంచి ఐడియా నన్ను నేను అభినందించుకున్నాను. కానీ మరో రెండు గంటల్లో ప్రయాణమై వెళ్ళబోతున్న శ్రీమతిని కలుసుకోవడం ఎలా?

అరగంట అవస్థలు పడి స్టోర్‌రూమ్‌లో జడపట్టుకుని ఆపేసాను. కెవ్వున అరవబోయింది. నన్ను చూసి అరవడం మాత్రం ఆపేసింది. కానీ బిత్తర చూపులు చూస్తూ పారిపోబోయింది. పగలు మాట్లాడాలంటే ఇంకా సిగ్గువదలలేదా పిల్లకు ఇంకాస్త గట్టిగా జడ పట్టుకుందామనుకున్నాను కానీ అటాచ్‌మెంటు కాస్త వూడి చేతిలో కొస్తుందని భయపడి వదిలేసాను. జడవదిలేసాక చిత్రం శ్రీమతి పారిపోలేదు. వెనక్కు తిరిగి అంది.

"నేనీరోజు వెళుతున్నాను."

"వద్దు....వద్దు....వెళ్ళకు....వెళ్ళకు...." ఇంపోజిషన్ పోజులో గాభరాగా అన్నాను.

నా గాభరాకు నా సిగ్గుల శ్రీమతికి కూడా నవ్వొచ్చేసింది

"కాదు విజ్జీ నువ్వెళ్ళనని మా అమ్మతో చెప్పేసేయ్."

ఈసారి ఆశ్చర్యపోయింది విజ్జి.

"అదెలా ఇది ఆషాడమాసం. మీరెప్పుడయినా రండి."

నాకు చప్పున కోపం వచ్చేసింది పైగా నాకెంటే నాలుగేళ్ళ చిన్నదయిన ఆమెకు ఆషాఢమాసం అంటే ఏమిటో తెలిసిపోయినందుకు ఉక్రోషం కూడా వచ్చేసింది.

"నాకేం వెళ్ళిపో వెళ్ళిపో మరి రాకసలు."

భర్తగారికి ఇంత హటాత్తుగా కోపమెందుకొచ్చిందో ఆ పిల్లకర్థం కానట్టు బిత్తరపోయి నిలబడిపోయింది.

★ ★ ★ ★

వానాకాలంలో వేడివేడి బజ్జీలాటి విజ్జీ వెళ్ళిపోతోంది. అత్తమీద అమ్మమీద ఇద్దరిమీద కోపం వచ్చేస్తోంది నాకు. అష్టరాల్ పెళ్ళయి ఆరురోజులే అయిందే ఎంతో అన్యోన్యంగా, చిలకా గోరింకల్లా అతుక్కోనున్నామే అలాటి వాళ్ళను ఎంత కౄరంగా విడదీస్తున్నారు వీళ్ళు!

అందరితో తగువేసుకోవాలనిపిస్తోంది.

ఆ పిలక పూజారిగాడిని లాక్కొచ్చి చెప్పిస్తే పోనీ....

"చూడవయ్యా బాపడా! సరిగ్గా ఆరు రోజుల క్రితం మమ్మల్నిద్దర్నీ కలిపి ఏమన్నావ్ నువ్వు కలిసి నూరేళ్ళు కాపుర చెయ్యమన్నావ్ అంటే క్షణమైనా విడవద్దన్నావు....అప్పుడే విడదీస్తున్నారు వీళ్ళు దీనికి నువ్వేం సంజాయిషీ చెప్తావు? ఏం పరిష్కారం చూపిస్తావు? అని....

పోనీ....పోనీ....వదినను బతిమలాడితే. ఛీ. ఇంత బ్రతుకూ బ్రతికి....అక్కతో ఆనాడు అంత సహాయం చేయించుకున్నా దశరధ మహారాజు లాగ వెధవది పది పైసలకు ఆశపడ్డానుకానీ కైకేయిలాగ వరం అడిగేసుండాల్సింది ఇలాటప్పుడు ఉపయోగపడేది ప్చ్....!

ఏ మార్గమూ నిర్ధారణ కాకముందే ఒక్క క్షణం నా కళ్ళల్లోకి చూచి చూపులు మరల్చుకొని బండెక్కి వెళ్ళిపోయింది విజ్జి..

విజ్జితో వెళ్ళిపోవాలనిపించింది. కానీ అక్కడకెళ్ళి ఏం లాభం? వాళ్ళింట్లో అన్నీ నడవ రూములు.

విజ్జిమీద నాకు చాలా కోపం వచ్చింది.

ఛీ....ఛీ....బొత్తిగా సరసం తెలీదు. శ్రావణమాసంలో స్టేట్స్ కెళుతున్న నన్ను వదిలి ఆషాఢంలో అమ్మగారింటికెళుతుందా?

★ ★ ★ ★

"నువ్వు మరీ మావా!"

కిల కిలా నవ్వులకు ఆదిరిపడి కిటికీలో నుండి చూసాను. సందులో వంటింటి ప్రక్కన వసారాలో నల్లటి నిగనిగ లాడే ఈరిగాడి బాహువుల మధ్య అమ్మోరు మచ్చల రంగి.

ఎంతదృష్టవంతుడు వాడు. ఆ క్షణంలో వాడినలా చూస్తుంటే కుళ్ళుగా వుంది. కసిగా వుంది. ఈ జన్మలో ఇక విజ్జీ తిరిగిరాదనేంత నిరాశగా వుంది. విజ్జీ వచ్చేలోపల నేను బ్రతికుంటానా? అనే నిరాశ కూడా వుంది.

నిజానికి ఈ క్షణం వరకు ఈరిగాడంటే నాకు అపరిమితమైన జాలి అమ్మోరు మచ్చల రంగిని భరిస్తున్నందుకు వాడిమీద సానుభూతి.

ప్చ్! అమ్మోరు మచ్చలయితేనేం? ఆషాఢమాసమని అది పుట్టింటికి పారిపోయిందా ఏం? ఎంత మంచిది రంగి.

మూడున్నర అడుగుల చాకలి దాని ఒంపు సొంపులు కూడా నన్నాకర్షించడం మొదలయ్యాక నన్ను నేను విమర్శించుకుని భయపడిపోయాను.

ఇలా కాదని బొడుక్కి తెచ్చుకున్న నవల తెరుచుకుని నాకు మా-

అత్తగారిచ్చిన ఆ రూమంతా ఆక్రమించుకున్న డబల్ కాట్ మీద పద్మాసనం వేసుకుని కూర్చున్నాను.

వెధవ నవల దాన్నిండా శృంగారమే అలా ఆ నవలను తిట్టుకున్న నేను కొన్ని నిముషాల్లోనే దానిలో తన్మయమయ్యాను.

"అదేంటన్నయ్యా! నేను....నేను" నా కౌగిలిలో నలిగిపోతున్నాడు నా చిన్న తమ్ముడు.

ఉలిక్కిపడి వదిలేసాను గజ్జెల బెల్టు కొత్తగా కొనుక్కున్న వాడు ఆ బెల్టు నాకు చూపాలని పరిగెట్టుకొచ్చాడు. ఆ సమయానికి నా కథలో హీరోయిన్ చిరుపాదాల గజ్జెల చప్పుడు చేసుకుంటూ నును సిగ్గుతో హీరో చాచిన చేతుల్లోకి పారవశ్యంలో ఒదిగిపోతోంది. అప్పుడు నేను హీరో పాత్రలో లీనమయిపోయి, గజ్జెల బెల్టు హీరోయిన్ విజ్జీ అయిపోయి....

మా చిన్న తమ్ముడు అవస్థ చూడనే చూసాడు. పెద్దక్క చిన్న చెల్లి ఏమర్థమయిపోయిందో చిన్న చెల్లి కూడ నవ్వుతోంది.

అర్థం కానిదల్లా మా చిన్న తమ్ముడి కొక్కడికే. ఈ వార్త మోసుకుని అక్క చెల్లి వంటింట్లో కెళ్ళాక వాడు తేరుకుని నా వైపు చురుగ్గా చూసాడు.

"నీకేం పిచ్చా ఏం?" అలా అంటూ వాడు కోపంగా వెళ్ళిపోయాక, నాకు మంచి ఐడియా వచ్చింది. చిన్న తమ్ముడు చెప్పినట్టు నాకు పిచ్చి పడితే విజ్జీని పిలిపించరూ! పిలిపించక చస్తారా కానీ నాకు పిచ్చిపట్టాలి ఎలా....ఎలా?

ఇంతలో మా పెద్ద చెల్లి నన్ను ఎగతాళి చేసి చంపడానికొచ్చింది.

చప్పున నేను స్పృహలోకొచ్చాను.

"విజయా ఓ కాగితం తీసుకురా" అన్నాను.

"వదినకు లెటర్ వ్రాయాలా" అంటూ కిసుక్కున నవ్వి లోపలి కెళ్ళింది విజయ.

కాగితం తెచ్చి ముసి ముసిగా నవ్వుతూ నాకందివ్వబోయింది. నేనందుకోలేదు. వీళ్ళకు గుణపాఠం చెప్పాలి. లేకపోతే ఈ నెల రోజులు తామిద్దరూ గడపడానికి అత్తలకు దూరంగా ఇంత అర్జంటుగా బాడుగ ఇల్లెక్కడ దొరుకుతుంది?

"నాకు కాదు నువ్వే.... అటు కూర్చో...."

"ఎందుకూ?"

"ఒక అప్లికేషన్ వ్రాయి"

"ఎవరికి?"

"దేముడికి"

బిత్తరపోయింది విజయ.

"కూర్చో...."

"అయోమయంగా కూర్చుంది."

టు ది గాడ్

మేఘాల వెనక వీధి

ఆకాశంపల్లె

ప్రపంచం పోస్టు

"నీకు పిచ్చా ఏం అన్నయ్యా?"

"ఊఁ నేను చెప్పేది ఎదురు చెప్పకుండా రాయలేవూ!"

నా రౌద్రాకారం చూసి కాస్త జంకింది విజయ. కానీ నా బాధ ఆ పిల్లకు బొత్తిగా అర్థం కావడం లేదని ఆమె వెర్రి చూపులు చెప్తున్నాయి.

"ఆషాఢ మాసం తీసేస్తావా. లేక నిన్ను ఖూనీ చేసి నన్ను పరిపాలించమంటావా."

"అన్నయ్యా" బెరుకు బెరుగ్గా చూసింది కళ్ళొత్తి నా వైపు.

పిచ్చిచూపులు పెట్టడానికవస్థపడుతున్నాను నేను.

"మధ్యలో మాట్లాడొద్దని చెప్పానా నేను."

చటుక్కున తలవంచి పెన్ చేతిలోకి తీసుకుంది. తెల్లకాగితం యింకా తెల్లగానే వుండడం నేను నా కంటి కొసల నుండి గమనించ లేదు.

అయినా ఆ విషయం బయట పెట్టినా తెలివిని ప్రదర్శించుకోదల్చుకోలేదు.

ఇట్లు రాజాసుబ్రావ్.

చెల్లి విపరీతంగా భయపడిపోయినట్టుంది నా వాలకం చూసి.

"నీ మనసు బాగలేనట్టుంది" నన్ను హేళన పట్టించాలని వచ్చిన ఆ పిల్ల అయోమయంలో పడిపోయింది. ఇప్పుడామెకు తోడెవరన్నా వుంటే బాగుణ్ణనిపిస్తోందో ఏమో లేవడానికి ప్రయత్నించింది.

నేను లేవబోతున్న ఆ పిల్లను కూర్చోబెట్టిలేచి నిలబడ్డాను.

"నన్ను అపార్థం చేసుకున్నావు చెల్లీ. పూర్తిగా అపార్థం చేసుకున్నావు" అన్నాను గంభీరంగా.

వెంటనే పిచ్చివాళ్ళు ఒక దానికొకటి సంబంధం లేకుండా మాట్లాడుతారనే విషయం స్ఫురణకొచ్చి-

"ఛీ....ఛీ.... బొత్తిగా నాగేశ్వరావు పోజు కుదరలేదు" అనికూడా అనేసాను.

అలా....అలా ...క్షణంలో నా పిచ్చివార్త ఇంట్లో పాకిపోయింది. డాక్టరు వచ్చేసాడు.

"మీకెలా వుంది చెప్పండి" అని అడిగాడు ఆ వీధిలోని కొత్తగా పాస్ అయిన కుర్రవాడు.

"అలా కాదు విజ్జీ! పేరు పెట్టి పిలవ్వూ ప్లీజ్" అనేసాను తెలివిగా డాక్టర్ కూడా బిత్తరపోయాడు.

ఒక రోజు ఇలాగే విజ్జీని "నన్ను ఏకాంతంలో ఎట్లీస్ట్ పేరు పెట్టి పిలవ్వూ అంటే ఇలాగే బిత్తరపోయింది. పాపం ఏమని పిలుస్తుంది సుబ్బూ! అనా?"

మెడ 15 డిగ్రీలు వాలుగా వంచి మెడనరాలు బిగబట్టి ఎడం చేతితో కాలరు ఒడిసి పట్టుకున్నాడు. నా కుడిచేతి చూపుడువేలు మెడ యాంగిల్‌లో నైస్టిఫ్‌గా ఆకాశంకేసి చూపి....

"చంద్రుడు భలే వున్నాడు" అన్నాడు.

ఆ పొంతన లేకుండా మాట్లాడుతున్న కొడుకుని చూసి భయపడ్డాడామె.

ఆమె వైపు ఆ డాక్టరు భయంలేదన్నట్టు చూసి నా దగ్గరగా వచ్చాడు.

నా ముఖం దగ్గరగా వచ్చి ఏదో చెప్పబోయాడు. చటుక్కున డాక్టర్ని ముద్దు పెట్టేసుకుని—

"విజ్జీ! మనిద్దరం హనీమూన్‌కి వెళ్ళిపోతున్నాం. బట్టలు సర్దుకో ఇదిగో మరలా ఆషాఢం అంటూ పారపోకేం. నేను నిన్ను వదిలి వుండలేను" అని నవ్వాను.

ఇప్పటి కర్థమయింది. డాక్టర్‌కు నేనెందుకు పిచ్చివాడినయ్యానో! అదే అడిగాడు మా అమ్మను. అమ్మ ఆషాడం కథ చెప్పింది.

అలాటి పన్నీ ఇప్పుడేమీ పెట్టుకోకండి.... మీ అబ్బాయి కిది అర్లీస్టేజ్‌లో వుంది. బాగా డిప్రెస్ అయినట్టున్నాడు. మీరు వెంటనే ఈ అబ్బాయి భార్యను పిలిపించడం ఉచిత సలహా యిచ్చాడు.

దానికి ఫలితంగా నిముషాలమీద విజ్జీ నా దగ్గర కొచ్చేసింది. ఆమె ముఖం నిండా విషాదం.

ఆమె వచ్చీరాగానే బెడ్‌రూమ్ తలుపు బోల్ట్ వేసాను. నా కౌగిట్లో భయం భయంగా ఒదిగిపోయింది విజ్జి దిగులుగా ముఖం పెట్టింది భర్తకి పిచ్చి పట్టిందని తెల్సి అతని ముఖంలోకి బిత్తరగా చూసింది.

ఆ పసిపిల్లలో ఏ కోశానా భర్త దగ్గరకు వచ్చిన ఆనందం లేదు.

అదంతా గమనించిన నేను నిజం చెప్పేశాను. "నీ కోసమే ఇంత పెద్ద నాటకమాడాను విజ్జీ కన్నా!"

గుండెలనిండా గాలి పీల్చుకుంది విజ్జి.

వాళ్ళిద్దరి సంతోషం అన్యోన్యత చూసి ప్రభాకరుడు కూడా మబ్బులు చాటుకెళ్ళి పోయాడు.

ఇది జరిగి పది సంవత్సరాలయింది.

నా భార్య ఆషాఢ మాసంలో మా ఇంట్లో గడిపి నన్ను తండ్రిని చేసినా కూడా విజ్జీ అత్తగారు.... అదే మా అమ్మగారు నిక్షేపంలా వున్నారు మనవలతో ఆడుకుంటూ.